www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 జనవరి 2024

5

కాకినాడ



సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు భువనేశ్వరి

ప్రజాశక్తి-కాజులూరు

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు గొల్లపాలెం జెడ్‌పి క్రీడాకారిణి నల్లమిల్లి భువనేశ్వరి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్‌బి.సుశీలమణి తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం సుశీలమణి విలేకరులతో మాట్లాడారు. జనవరి 10 నుండి 15 వరకు రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లో 67 స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో భువనేశ్వరి ఎంపికయ్యిందని తెలిపారు. గత నవంబర్ 4 నుంచి 6 వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఎస్‌జిఎఫ్ సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యిందని పీడీ సునీల్ కుమార్ తెలిపారు. భువనేశ్వరిని జెడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు, సర్పంచ్ పోతురాజు ప్రసన్న తదితరులు అభినందించారు.

ప్రయివేటు బాదుడు షురూ..!

- పండుగ వేళ ఛార్జీల పెంపు
- ట్రావెల్స్ సంస్థల నిర్వాకం
- అధికారుల నియంత్రణ కరువు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సంక్రాంతికి ఆర్‌టిసి అదనపు ఛార్జీలను వసూలు చేయడం లేదని ప్రకటించినప్పటికీ ప్రయివేటు బస్సుల యజమానులు మాత్రం ఇష్టారాజ్యంగా ఛార్జీలను పెంచి ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఏటా పండగ రోజుల్లో ఈ ప్రయివేటు దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా రవాణా శాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆలిండియా పర్మిట్ ట్రావెల్ బస్సులు 61, దూర ప్రాంతాలకు తిప్పుతున్న బస్సులు 30, ఇతర ప్రాంత సర్వీసులు సుమారు 100కు పైగా ఉన్నాయి. సంక్రాంతి పండక్కి పట్టణాలు, నగరాల్లో ఉంటున్న వారంతా సొంత ఊళ్లకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లిన వారంతా తిరిగి ఇళ్లకు చేరుకుంటారు. కొంత మంది పది రోజులకు ముందుగానే సొంతూళ్లకు వస్తుండగా, మరి కొంత మంది మరో వారం రోజుల్లో బయలు దేరనున్నారు.

ఈ నేపథ్యంలో ఎపిఎస్ ఆర్‌టిసి 46 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. సాధారణ టిక్కెట్ ఛార్జీలకే ఈనెల 10వ తేదీ నుంచి 13 వరకూ హైదరాబాద్ నుంచి వీటిని తిప్పనున్నారు. పండక్కి తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు వచ్చేవారి సంఖ్య అధికంగా ఉండడంతో ఈ ఆర్‌టిసి సర్వీసులు సరిపోవట్లేదు. మరోవైపు సామాన్యుడికి అందుబాటులో ఉండే రైల్వే టికెట్లు సైతం పూర్తిగా నిండుకున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇదే అదునుగా యాజమాన్యాలు భారీగా చార్జీలను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు.

బాదుడే బాదుడు

హైదరాబాద్ నుంచి కాకినాడ, పిఠాపురం, రాజమహేంద్రవరం, అమలాపురంల వరకూ సిరి, శ్రీకృష్ణ, బిగ్ బస్, మోజో, విక్రమ్, సమన్వి, శ్రీరామ ట్రావెల్స్, వికావేరి తదితర ట్రావెల్ బస్సులు పండుగ వేళ వ్యాపారం సాగిస్తున్నాయి. హైదరాబాదు నుంచి కాకినాడ, రాజమండ్రి, తుని, పిఠాపురం, రావులపాలెం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం వంటి ప్రాంతాలకు సాధారణ రోజుల్లో సెమీ స్లీపర్ బస్సుకు రూ.825, స్లీపర్ బస్సుకి రూ.1570, వాల్వో బస్సుకి మరో రూ.200 అదనంగా ఉంటే, పండుగ వేళ సెమీ స్లీపర్‌కు రూ.2,500, స్లీపర్ (బెర్త్) బస్సుకి రూ.3 వేలు టిక్కెట్ ధరలను నిర్ధేశించారు. అదును చూసి ప్రయాణికుల అవసరాలను అసరాగా చేసుకుని రూ.3,500 నుంచి రూ.4 వేలు కూడా వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. సాధారణ ధరలను బ్లాక్ చేసి ధరలను పెంచడంతో పలువురు గగ్గోలు పెడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనేకమంది సామాన్యులు అధిక ధరలకు టిక్కెట్లను కొనుగోలు చేసి సొంత ఊళ్లకు బయలుదేరే పరిస్థితులు నెలకొన్నాయి.



ప్రయివేటు బస్సుకు టిక్కెట్లు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

టిక్కెట్ రూ.3వేలు అంటున్నారు

నా కుమార్తె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ శిక్షణ పొందుతోంది. ఈ నెల 10 నుంచి సెలవులు కావడంతో ఇంటికి వచ్చేందుకు టిక్కెట్ బుక్ చేయమంది. ఆర్‌టిసి, రైలు టిక్కెట్లు లేకపోవడంతో ప్రయివేటు స్లీపర్ బస్సు టిక్కెట్ కోసం వచ్చాను. గతంలో రూ.1500 ఉన్న టిక్కెట్ ఇప్పుడు రూ.3వేలు అంటున్నారు. తీసుకుంటే తీసుకోండి లేకుంటే లేదు అని ఆపరేటర్ చెబుతున్నారు. ఇలా అయితే ఎలా? అధికారులు పట్టించుకోవాలి

- సుంకర సత్యనరాయణ, కాకినాడ.

విఒఎల డిఆర్‌డిఎ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ డిఆర్‌డిఎ పీడీ కార్యాలయాన్ని సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు శుక్రవారం ముట్టడించారు. త్రీటౌన్ సిఐ భగవాన్ అభ్యర్థన మేరకు వెలుగు అధికారులను లోపలికి అనుమతించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, నేరుగా విఒఎల ఖాతాలో వేతనాలను జమ చేయాలని, రాజకీయ, అధికారుల వేధింపులు అరికట్టాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేయాలని, కాజులూరు, కాకినాడ రూరల్ మండలాల్లో అక్రమంగా తొలగించిన 17 మందిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం నాయకురాలు కె.గంగాభవాని, సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడారు. నాలుగేళ్లలో అనేకసార్లు పీడీ కార్యాలయంలో విఒఎల సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చినా, ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు కాబట్టే పీడీ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వచ్చిందని తెలిపారు. రాజకీయ కారణాలతో కాజులూరులో ఏడుగురిని, కాకినాడ రూరల్‌లో పది మందిని అక్రమంగా తొలగించారని, ఇచ్చే రూ.8 వేల వేతనం సైతం నెలల తరబడి బకాయి పెడుతున్నారని, అది కూడా నేరుగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో విఒఎల పాత్ర కీలకమైందన్నారు. స్త్రీ నిధి విజయవంతం అవడంలో తమ కృషిని ప్రభుత్వం గుర్తిచడం లేదని వాపోయారు. సమస్యలను జిల్లా అధికారులు పట్టించుకోకపోతే ఇదే పీడీ కార్యాలయం వద్ద 6వ తేది నుంచి రిలే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మేరీ, సిఐటియు జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, దుమ్ముల మేరీ, సాధనాల పద్మ, కె.ఈశ్వరీభాయ్, ఎం.రామలక్ష్మి, కె.సత్యవేణి, ఎన్.దేవి నాయకత్వం వహించారు.



డిఆర్‌ఎడి కార్యాలయాన్ని ముట్టడించిన విఒఎలు

చెత్తను రోడ్లపై వేయొద్దు : కమిషనర్

ప్రజాశక్తి-కాకినాడ

పారిశుధ్య కార్మికుల సమ్మెను దృష్టిలో ఉంచుకొని చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలోను వేయకుండా ప్రజలు, వ్యాపారులు తమ వంతు సహకారం అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక మెయిన్ రోడ్, పెద్ద మార్కెట్, జ్యోతుల మార్కెట్, లక్ష్మీనారాయణ కంపెనీ ప్రాంతాలలో ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ చరణ్‌తో కలిసి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్నిచోట్ల వ్యాపారులు చెత్తను రోడ్లపై వేయడానికి గుర్తించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు వ్యాపారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇటువంటి పరిస్థితి పునరావతం కాకుండా అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా చెత్తను రోడ్లపై వేస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, ప్రజల నుంచి కూడా తగిన తోడ్పాటు అవసరమన్నారు. గృహిణులు చెత్తను ఇళ్లకు వచ్చే హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే అందజేయాలని సూచించారు. ప్రజల సహకారం లేకపోతే పారిశుధ్యం క్షీణించి అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు సీజనల్ వ్యాధులకు అవకాశం ఉంటుందని హెచ్చరించారు.



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్

12 కల్లా ఓటర్ల జాబితా మార్పుల పరిష్కారం

ప్రజాశక్తి-కాకినాడ

ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా గత అక్టోబర్ 27న ముద్రించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అందిన దరఖాస్తులను ఈ నెల 12 నాటికి పరిష్కరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న వివిధ కార్యకలాపాలను, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గత అక్టోబర్ 27న ముద్రించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అందిన దరఖాస్తులను ఈ నెల 12 నాటికి పరిష్కరించి, 22న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. ఫారం 6, 7, 8ను గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఇవిఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు విస్తత అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), పెద్దిరెడ్డి రవికిరణ్ (బిజెపి), గదుల సాయి బాబా (టిడిపి), సబ్బారపు అప్పారావు (బిఎస్‌పి) వి.చంద్రరావు (సిపిఎం) కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సిడిపిఒ వ్యాఖ్యలపై అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి- తాళ్లరేవు


అంగన్వాడీల సమ్మెపై తాళ్ళరేవు సిడిపిఒ మాధవి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్వాడీలు, ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఇటీవల ఇంజరం అంగన్వాడీ వర్కర్ గాలి ఝాన్సీ రత్నకుమారి అనారోగ్య కారణంతో మరణించగా ఆమె గురించి మాట్లాడడానికి శుక్రవారం వెళ్లిన తమపై సిడిపిఒ మాధవి అనుచిత వ్యాఖ్యలు చేశారని యూనియన్ నాయకులు పి.ఆదిలక్ష్మి తెలిపారు. సమ్మెను విరమించి విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు పోతాయని, సమ్మె విరమించాలని, యూనియన్ నాయకులకు జీతాలు వస్తాయి, వాళ్లకు పని ఏముంది, రేపొద్దుట పోయేది మీరే అని బెదిరించారని చెప్పారు. మహిళా సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్.రమణి, భవాని మాట్లాడారు. సిడిపిఒ మాధవి చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలని చెప్పారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, కెవిపిఎస్ సంఘం నాయకులు టి.ఈశ్వరరావు, వి.రాబాబు, విప్పర్తి శ్రీనివాసరావు, దుప్పి అదృష్టదీపుడు మద్దతు పలికారు.

వైసిపి హయాంలో దళితులపై దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామర్లకోటలో వైసిపి నాయకుల వేధింపుల వల్ల ఒకరు మరణించారన్నారు. సుబ్రహ్మణ్యం అనే దళిత డ్రైవర్‌ను వైసిపి నాయకుడు చంపి డోర్ డెలివరీ చేశాడన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఆ ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు పెట్టకుండా దారి మళ్లించారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన వైసిపి సామాజిక సాధికార యాత్ర నిర్వహించటం విడ్డూరంగా ఉందన్నారు. సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మద్యపాన వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండల కేంద్రమైన ప్రత్తిపాడులో మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్ సూర్యనారాయణ మాట్లాడుతూ మద్యం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మొదట కిక్కిస్తుందని, తర్వాత రక్తం కక్కిస్తుందని అన్నారు. ప్రభుత్వాలు మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా చేసుకొని పాలించడం దురదృష్టకరమన్నారు. మద్యం ధరలు అధికంగా పెంచడంతో పేద ప్రజలు సారా తాగి అకాల మరణాలు పాలవుతున్నారని చెప్పారు. పేద ప్రజలు ఎక్కువగా జీవించే ప్రాంతాల్లో మద్యపానం అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పేద, మధ్య తరగతి వారిలో మార్పు తీసుకురావడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేమగిరి తలుపులయ్య, చంటి మెహర, మిరియాల సత్యానారాయణ, మోర్త కుశలన్న, పెద్దాడ చంటి కాతేటి అమ్మాజీ, నురుకుర్తి లోవ, మిర్యాల కృపారాణి, నేదురు పెంటయ్యమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి-కాకినాడ

సమగ్రశిక్ష ఉద్యోగులు శాంతియుతంగా తలపెట్టిన విజయవాడ ఎస్‌పిడి ఆఫీస్ ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేయడాన్ని సిఐటియు జిల్లా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ శుక్రావరం ఒక పత్రికా ప్రకటనలో ఖండించారు. 2018 యాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన హామీ అమలు కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగుల పట్ల జగన్ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి నిర్బంధం విధించడానికి ఖండించారు. తక్షణం అరెస్టు చేసిన ఉద్యోగులందరినీ బేషరతుగా విడుదల చేయాలని, ఉద్యోగుల న్యాయబద్ధమైన, డిమాండ్లను పరిష్కరించి 17 రోజులుగా జరుగుతున్న నిరవధిక సమ్మెను విరమింపచేయలని డిమాండ్ చేశారు. లేకుంటే సిఐటియు అనుబంధ సంఘాలన్నీ ఉద్యోగులకు మద్దతుగా పొరటంలోకి దిగుతామని హెచ్చరించారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ కేంద్రమంత్రి ఎంఎం.పల్లంరాజు అన్నారు. తునిలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ కమిటీల ద్వారా ప్రతి నియోజకవర్గంలో విస్తతస్థాయి సమావేశాల ద్వారా ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, ఉమ్మడి వెంకట్రావు, దాట్ల గాంధీ రాజు, పెద్దాడ సుబ్బారాయుడు ఆకుల వెంకటరమణ, ధర్నాలకోట శ్రీను, వెంకటేశ్వరరావు, కొల్లు వీర గణేష్, మొయ్యేటి సూర్యప్రకాశరావు, తోజోమూర్తుల ఉషారాణి, పోతాబత్తుల పెద్దబాబు, పలివెల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ తోటకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ మాజీ ఎంపీ తోట గోపాలకృష్ణకు పలువురు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. పెద్దాపురం మండలం కాండ్రకోటలో గోపాలకృష్ణ 12వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోకా నానాజీ, నూకాలమ్మ దేవస్థానం ఛైర్మన్ గవరసాన వీరాస్వామి, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, చిక్కం జగ్గరాజు, ఊటా నాగన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు క్లాప్స్ డ్రైవర్ల మద్దతు

ప్రజాశక్తి-కాకినాడ

మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా శుక్రవారం మున్సిపల్ వాహన డ్రైవర్స్ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని అనేకసార్లు వినతులు, ధర్నాలు, దశలవారీగా ఆందోళనలు చేపట్టిన తరువాత అనివార్యమైన పరిస్థితుల్లోనే సమ్మె నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మున్సిపల్ కార్మికులను ముఖ్యమంత్రి హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, న్యాయమైన ఇతర డిమాండ్లు కూడా పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కోవిడ్ సమయంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మున్సిపల్ కార్మికులు, డ్రైవర్స్ ఏవిధంగా పని చేశారో అందరూ గమనించారని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు నగర ప్రజలు అండగా నిలబడాలని కోరారు. డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు మందపల్లి సూర్య ప్రకాష్, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకట రమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సప్పా అప్పన్న ప్రసాద్, కొల్లి శ్రీనివాసరావు, ముప్పిడి దుర్గాప్రసాద్, లోకేష్, కృష్ణ, సత్యానందం, దుర్గా ప్రసాద్, వెంకన్న, శ్రీనివాస్, సత్తిబాబు, ఫణి పాల్గొన్నారు.



పిఠాపురంలో పొర్లు దండాలు పెట్టి నిరసన తెలుపుతున్న శానిటేషన్ వర్కర్స్

సామర్లకోట రూరల్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. దీక్షా శిబిరంలో మహిళా కార్మికులు మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, పట్టణ కార్యదర్శి పెద్దిరెడ్డి సత్యనారాయణ, ఎలిసెట్టి రామదాసు, సిపిఎం పట్టణ కార్యదర్శి కరణం ప్రసాదరావు, బొచ్చ శీను, కసింకోట ఆనందరావు, కసింకోట కిషోర్, కౌలు వరమ్మ, సింగంపల్లి పద్మ, బంగారు కొండమ్మ, చెన్నా నాగమణి, బంగారు లావణ్య, సత్తిబాబు, ఆజారి లోవరాజు, వెంకటేష్, ఎన్‌వి.నాగేంద్ర, మిర్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో మున్సిపల్ కార్మికులకు డ్రైవర్స్ సంఘీభావం

గొల్లప్రోలు (పిఠాపురం) నగర పంచాయతీలో ప్రభుత్వం తమ గోడు వినాలని పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు కె.చిన్న, నందీశ్వరరావు మాట్లాడారు. యేసమ్మ, వి.రమణ, రామారావు, సత్యవతి, సింహాచలం, రాజు, పోలమ్మ, కుమారి, పార్వతి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు

ప్రజాశక్తి-కాకినాడ

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా అస్యూర్డ్ మినిమం ఫెసిలిటీ (ఎఎంఫ్) సమావేశాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి సదుపాయాల కల్పనపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టి కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ కతికా శుక్లా ఆదేశించారు. డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, ఆర్ఐఒ ఎన్ఎస్‌విఎల్ నరసింహ, డిఇఒ జి.నాగమణి, పిఆర్ ప్రిన్సిపల్ తిరుపాణ్యం, పశు సంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, మత్స్య శాఖ జెడి పివి.సత్యానారాయణ, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ పాల్గొన్నారు.



నీటి పక్షుల లెక్కింపులో పాల్గొన్న ఫారెస్టు సిబ్బంది

మడ అడవుల్లో నీటి పక్షుల లెక్కింపు

ప్రజాశక్తి- తాళ్లరేవు

పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే పక్షులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని కాకినాడ జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి అన్నారు. శుక్రవారం కోరంగి బయోడైవర్సిటీ కేంద్రంలో నిర్వహించిన ఏషియన్ బర్డ్ సెన్సెస్ 2024 వర్క్ షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. పర్యావరణంలో నెలకొన్న పరిస్థితులను అంచనా వేసేందుకు పక్షుల గణన ఎంతగానో దోహదపడుతుందని, అందువల్ల మడ అడవుల్లోని నీటి పక్షులను గణన చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ పి.సత్య సెల్వం, కె.మృత్యుంజయ రావు, సీనియర్ సైంటిస్ట్ పర్వీన్ షేక్, డి.మహేష్ బాబు తదితరులు పక్షుల గణన ప్రాముఖ్యతను వివరించారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మాధవపట్నంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందారు. మాధవపట్నం వంతెన సమీపంలో పంట కాలువల మధ్య చెట్టుకు ఒక వ్యక్తి ఉరేసుకొని కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు మాధవపట్నం గ్రామానికి చెందిన దండంగి రాంబాబు (34)గా స్థానికులు గుర్తించారు. రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముగ్గురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - వాల్తు

మండలంలోని కలవలపల్లికి చెందిన సారా కేసుల్లో పాత నేరస్తులు జొన్న నాగరాజు, జొన్న శివనాగరాజు, సత్తి మణికంఠలను బైండోవర్ చేశామని కొవ్వూరు సెబ్ ఇన్స్పెక్టర్ వివివి.సత్యనారాయణ తెలిపారు. వారిని శుక్రవారం తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి ఎదుట హాజరుపరిచామన్నారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని రేగులగుంటలో మీసాల రామారావు అనే వ్యక్తి 10 మద్యం సీసాలు అక్రమంగా కలిగి ఉండడంతో అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐబి సిఐ డి.సుధ తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పి.దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది కె.శ్రీకాంత్ పాలుగొన్నారని తెలిపారు. 8 మందిని బైండోవర్ చేశామన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఇబి ఇంచార్జ్ సిఐ కె.వి స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రమాంపల్లి గ్రామంలోని సారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ తెలిపారు. ఈ దాడుల సందర్భంగా సారా కేసులకు సంబంధించి తప్పించుకు తిరుగుతున్న గుర్రంపాలెంకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సారా కేసుల్లో 19 మందిని బైండోవర్ చేసి తహశీల్దారు కోర్టులో హాజరు పరిచామన్నారు.

పిడిఎస్ బియ్యం వాహనాలు సీజ్

ప్రజాశక్తి-పిఠాపురం

అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం వాహనాలను సీజ్ చేసినట్లు రాజమహేంద్రవరం విజిలెన్స్ సిఐ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తమకు బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు స్థానిక సొగిండ్ల అపార్ట్మెంట్ సమీపంలో బడా దోస్త్ వ్యాన్ వాహనం, ఎండియు వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. బడా దోస్త్‌లో 48 మూటలలో 2410 కేజీలు, ఎండియు వాహనంలో 11 బ్యాగ్ లలో 550 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం సీజ్ పిడిఎస్ బియ్యం విలువ రూ.1,18,400, రవాణా వాహనాలు రూ.9,00,000 ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ ఐ, సిబ్బంది, ఎం ఎస్ ఒ, విఆర్వో ఉన్నారు.



కల్వర్టులో దిగబడిన స్కూలు బస్సు

స్కూల్ బస్సుకు తప్పిన ముప్పు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో శుక్రవారం విద్యార్థులకు ప్రమాదం తప్పింది. స్థానిక కోలావారి వీధిలో విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్ పాఠశాల బస్సు శిథిల కల్వర్టు మీదుగా వెళుతుండగా కల్వర్టు ఒక్కసారిగా కూలి పోవడంతో బస్సు గోతిలో దిగబడింది. బస్సులో ఉన్న విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. విద్యార్థులను మరో బస్సులో పాఠశాలకు తరలించారు. అనంతరం మరో వాహనం సహాయంతో బస్సును బయటకు తీసే చర్యలు చేపట్టారు.

25వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 25 రోజులకు చేరుకుంది. సమ్మెకు పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సిఐటియు కాకినాడ నగర అధ్యక్షులు పలివెల వీరబాబు సమ్మె శిబిరంలో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. జి.రమణమ్మ, నీరజ, మున్ని, సరోజ, విజయ, వీర వేణి, చాముంతి, శ్రీదేవి పాల్గొన్నారు.

కిర్లంపూడి యూనియన్ మండల అధ్యక్షురాలు రత్నం, కె.అచ్యుతాంబ, ఎలిజబెత్ రాణి, పి.సావిత్రి, షేక్ పర్వీన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం పాల్గొన్నారు.

శంఖవరం జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్య బాబు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్ అయిన జీతాల పెంపును గాలికి వదిలేసి, ప్రభుత్వం ప్రాధాన్యం లేని వాటిని తెరపైకి తెస్తోందన్నారు. అంగన్‌వాడీలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు గాబు సుభాష్, డాక్టర్ సత్తి వీర్రాజు, కీర్తి కుమార్, రావూరి రామకృష్ణ, గౌతు లక్ష్మి వెంకటేశ్వరరావు, నల్లల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం స్థానిక మున్సిపల్ సెంటర్లో అంగన్‌వాడీలు ఎండలో కూర్చుని నిరసన తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి దాడి బేబీ మాట్లాడారు. టి.నాగమణి, అమల, ఎస్తేరురాణి, ఎం.వరలక్ష్మి, స్నేహలత, మంగ, దుర్గాభవాని, వెంకటలక్ష్మి, ఫాతిమా, తులసి, సావిత్రి, టివిఎల్.పద్మావతి, సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, ఎస్.శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.


పిఠాపురంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



పెద్దాపురంలో..

ఏలేశ్వరం యూనియన్ సెక్టార్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.అమరావతి, జె.రాణి, పి.సూరకర్తం, ఆర్.రత్నకుమారి, కె.రమ్య, పి.గంగాభవాని, బి.జ్యోతి, జి.పార్వతి పాల్గొన్నారు.

కరప సమ్మె శిబిరంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్‌వి.రమణి మాట్లాడారు. అక్క చెల్లెమ్మలు అంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరుతుంటే మహిళా పోలీసులను ఉసిగొల్పి మహిళల దుస్తులు ఊడదీస్తూ ప్రవర్తించిన ప్రభుత్వం నైజం ఏమిటో బయటపడిందన్నారు. ప్రాజెక్టు నాయకురాలు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, దైవకుమారి, ఆశాలత్నం, కల్యలత, హెల్పర్ సత్యామాధవి, ఎం.భవాని, నారాయణమ్మ, మంగతాయారు, సరోజిని, జ్యోతి, కల్పలత, పి.లక్ష్మి, ఏ.దేవి, బి.మనోజ, లక్ష్మి సాయి దుర్గ, బి.భవాని పాల్గొన్నారు.

పిఠాపురం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి మాట్లాడారు. నాయకులు విజయశాంతి, ప్రజావాణి, నళిని, సత్యవతి, భవాని, అమల, బేబీరాణి, రామలక్ష్మి, సత్యవతి, నాగ పద్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెదపూడి సిఐటియు జిల్లా సహాధ్యక్షుడు కె.సత్తిరాజు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఎం.రాజేశ్వరి, ఎ.కనకదుర్గ, జి.సత్యవతి, డి.మేరీ రత్నం, జి.సరోజిని, ఎం.సత్యవేణి, కె.చిన్నారి, కె.లావణ్య, కె.లక్ష్మి, ఎన్.విజయకుమారి, ఎం.శ్రీదేవి, కెకె.అన్నపూర్ణ, డి.కాంతామణి పాల్గొన్నారు.

'అవినీతి పరుని చేతిలో కాకినాడ'

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు చేతిలో కాకినాడ నగరం ఉందని కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కాకినాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వనమాడి విలేకరులతో మాట్లాడారు. కాకినాడకు సిఎం జగన్ వచ్చి వెళ్లటం వల్ల నగరపాలక సంస్థకు రూ.రెండు కోట్లు వథా అయ్యిందన్నారు. ఎంఎల్ఎ ద్వారంపూడి తన కుటుంబం కోసం మాట్లాడే ముందు అతను ఏర్పాటు చేసుకున్న నూతన కుటుంబం రాబోయే కాలంలో ఎటు సాగుతుందో చూడాలన్నారు. వాలంటీర్లు, పోలీసుల సమక్షంలో ఎందుకు తిరుగుతున్నాడో ద్వారంపూడి చెప్పాలన్నారు. తాను అవినీతి చేశానని విమర్శించే ద్వారంపూడి ఈ నాలుగున్నర సంవత్సరకాలంలో ఎందుకు నిరూపించలేకపోయాడో చెప్పాలన్నారు. ద్వారంపూడి చేసిన ప్రతి అవినీతిని సాక్ష్యాలతో సహా నిరూపించానని తెలిపారు. ద్వారంపూడి చేసిన అవినీతి వల్ల మడ అడవుల ధ్వంసం విషయంలో అప్పటి కలెక్టర్, కమిషనర్లు నేడు కేసులు ఎదుర్కొంటున్నారని, సురేష్ నగర్ పార్క్ టిడిఆర్ బాండ్ల పేరుతో రూ.219 కోట్లు కొట్టేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కాకినాడ అభివద్ధి నిమిత్తం ఒక రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. తనపై పోటీకి భయపడుతున్న ద్వారంపూడికి పవన్ కళ్యాణ్ ఎందుకని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, పలివెల రవి, తుమ్మల రమేష్, కొల్లాబత్తుల అప్పారావు, ఒమ్మి బాలాజీ, సీకోటి అప్పలకొండ, గుజ్జు బాబు, బంగారు సత్యనారాయణ, బండి నరేంద్ర పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

యు.కొత్తపల్లి : అరబిందో ఫార్మా ఫౌండేషన్ సాయంతో వివిధ గ్రామాల్లో రూ.రెండు కోట్ల వ్యయంతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులకు ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ పెండెం దొరబాబు శుక్రవారం భూమి పూజ చేశారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ సరైన రహదారి సౌకర్యం లేక ప్రజల తీవ్ర అసౌకర్యాన్ని గమనించి ఎంఎల్ఎ దొరబాబు అరబిందో సంస్థ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే సానుకూలంగా స్పందించిన సంస్థ డైరెక్టర్లు నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రారెడ్డి తమ ఫౌండేషన్ ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నారని చెప్పారు. అరబిందో సంస్థ యాజమాన్యానికి ఎంపీ గీత కృతజ్ఞతలు తెలిపారు. జెడ్‌పిటిసి గుబ్బల తులసి కుమార్, ఎంపిపి కారే సుధా శ్రీనివాస్, యండపల్లి సర్పంచ్ శీలం పెద అప్పారావు, జ్యోతుల చక్రబ్బాయి పాల్గొన్నారు

ఉచిత బియ్యం పంపిణీ తనిఖీ

సామర్లకోట రూరల్ : పట్టణంలో పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం రేషన్ షాపులను, ఎండియు వాహనాలను తనిఖీ చేశారు. మండల సివిల్ సప్లయ్ అధికారి కీర్తి ఆధ్వర్యంలో స్థానిక మఠం సెంటర్, వీర్రాఘవపురంలో రేషన్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యం నిల్వలు, వాటికి సభందించి రికార్డులను అధికారులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న పోర్టిఫైడ్ బియ్యం నాణ్యత, వాటి వినియోగంపై డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు వార్డుల్లో బియ్యం అందిస్తున్న ఎండియు వాహనం వద్దకు చేరుకుని ప్రజలను అందిస్తున్న బియ్యం, ఇతర సరుకులను పరిశీలించారు. వాహనం ద్వారా ఏయే సరుకులు అందిస్తున్నారో విచారించారు. సరుకుల నాణ్యతను అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సమన్వయంతో టెన్నిస్ పోటీల నిర్వహణ

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో నేషనల్ టెన్నిస్ అండర్ 19 బాయ్స్ ఆటల పోటీలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జనవరి 20వ తేదీ నుంచ 24వ తేదీ వరకు కాకినాడ డిఎస్ఎ గ్రౌండ్స్‌లో నిర్వహించే 67 వ నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2023 -24 పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 29 రాష్ట్రాల నుంచి 44 టీములు పాల్గొంటాయని, ప్లేయర్లు, కోచ్‌లు, మేనేజర్స్ 308 మంది హాజరు కానున్నారని తెలిపారు.

అనుసంధాన వేతన చెల్లింపు పద్ధతి వద్దు

ప్రజాశక్తి-పిఠాపురం

ఉపాధి హామీ కూలీలకు ఆధార్ కార్డు బ్యాంక్ ఆకౌంట్ ఉపాధి జాబ్ కార్డు అనుసంధానం ఆధారంగా వేతనాలు చెల్లించాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కూలీల పొట్ట కొట్టే విధంగా ఉందని తక్షణం దీన్ని రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పి.రాయవరం, పి.తిమ్మాపురం గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలతో సచివాలయ అధికారులు, ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో గ్రామీణ ఉపాధి చట్టం ద్వారా 15 కోట్ల మందికి వంద రోజులు పనిని కల్పిస్తున్నారరన్నారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టం పనిని కుదించడానికి అనేక చర్యలకు పూనుకుందని చెప్పారు. దీనిలో భాగంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించకుండా కోత విధించిందన్నారు. కూలీల సంఖ్యను తగ్గించే చర్యలకు పునుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.సింహాచలం, మండల కార్యదర్శి కాల్దారి రాఘవ, జిల్లా కమిటీ సభ్యులు ఊబ బుల్లబ్బాయి, డెక్కల లాజరు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న వ్యకాస నాయకులు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్, కాకినాడ రూరల్

ప్రజారోగ్యానికి సిఎం వైఎస్.జగన్ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. శుక్రవారం జగ్గంపేట మండలం మల్లిసాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శిబిరాన్ని జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష-1 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిందని, అదే స్ఫూర్తితో సురక్ష-2 కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. జగనన్న ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకువచ్చి ఇంటింటికీ వైద్యం అందిస్తున్నారన్నారు. వైద్యం రంగంలో నాడు - నేడు అమలు పరచి హాస్పిటల్స్ అభివద్ధి పరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి సుకరత్నం, అత్తులూరి శ్రీనివాసు, వైద్యులు డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ పూజ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో ఆరోగ్యశ్రీ కార్డులను సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యాన వైఎస్ ఎంపిపి బందిలి విరీష అందజేశారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ పేదలందరికీ మెరుగైన వైద్యం ఉచితంగా అందించడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నట్లు చెప్పారు. వైద్యం పేదలకు అందని ద్రాక్షగా ఉండే సమయంలో పేదలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే తండ్రికి తగ్గ తనయునిగా సిఎం వైఎస్.జగన్ మరిన్ని వైద్యసేవలను ఆరోగ్యశ్రీకి అనుసందానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో

యానాం వార్తలు

పనులకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ, మున్సిపాలిటీల్లో అనేక పనులు చేసి బిల్లులు రాక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని యానాం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్ఎఒ మునిస్వామిని కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిడబ్ల్యుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 2023 నవంబర్ 12న పుదుచ్చేరికి బదిలీ అయ్యారని, కానీ ఇప్పటివరకు యానాంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లేక కాంట్రాక్ట్ చేసిన పనులకు బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ ఇంజనీర్లు,అసిస్టెంట్ ఇంజనీర్లు బిల్లులు సిద్ధం చేయకపోగా నిధులు లేవని చెబుతున్నరన్నారు. కొత్త టెండర్లు లేవని, టెండర్లకు పిలవకపోతే కేటాయించిన నిధులు వెనక్కి వెళ్లిపోతాయన్నారు. రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను నియమించి బిల్లులు విడుదల చేయాలని కోరారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజవర్గానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాను ఆర్ఎఒ ఛాంబర్‌లో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఆర్ఎఒ మునిస్వామి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పార్లమెంట్ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో తప్పొప్పులు సవరించారన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తయ్యాయని తెలిపారు. ప్రజల కోసం ఎన్నికల ఆఫీసుల్లో ఈ నెల 5 నుంచి 13 వరకు ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నా డిఎంకె అధ్యక్షుడు మంచాల సత్య సాయికుమార్, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం ప్రచారంలో జెవివి కృషి

ప్రజాశక్తి - యానాం

శాస్త్రీయ దక్పథం ప్రచారంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ బాలుర పాఠశాలలో యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యానాం కమిటీ ప్రతి సంవత్సరం చెకుముకి సైన్స్ సంబరాలు, శాస్త్రీయ ఆలోచన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. అనంతరం జెవివి ప్రచురించిన భారతీయ శాస్త్రవేత్తల 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జె.సత్యనారాయణ, కె.వి.వి. సత్యనారాయణ, కాశి జానకి రాముడు, దంగేటి త్రిమూర్తులు, కె.సుబ్బారావు, పి.సిద్ధార్థ కుమార్, రీజెన్సీ స్కూల్ ఉపాధ్యాయుడు నాగేంద్ర, వివేకానంద ఉపాధ్యాయిని అశ్వని, ఎం.జి.జి.బాయ్స్ స్కూల్ ఉపాధ్యాయిని మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

తాళ్లరేవు : పి.మల్లవరం హైస్కూల్లో హెచ్ఎం పి.వెంకట శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు శుక్రవారం ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయుడు గంగాధర్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, దున్నా రాంబాబు, సబ్బతి రామకృష్ణ, దుర్గాప్రసాద్, మట్టపర్తి తులసి పాల్గొన్నారు.

ముస్లిం కల్యాణ మండపం నిర్మాణానికి కృషి


పెద్దాపురం : త్వరలోనే పెద్దాపురంలో ముస్లిముల కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక కబడ్డీ వీధిలోని జామియా మసీదులో శుక్రవారం ప్రార్థనల అనంతరం ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. స్థానిక టిటిడి కల్యాణ మండపం పక్కన ఉన్న పాత మీసేవ కేంద్రం భవనాన్ని ముస్లిముల కళ్యాణం మండపంగా తీర్చిదిద్దుతామన్నారు. దీనికోసం రూ.10 లక్షల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ సభలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోసెస్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, బషీర్, ఖాదర్, మక్బూల్, జానీ, మౌలానా, సత్తార్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ


పెంచిన పింఛన్లను శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటనందూరు రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, లక్ష్యంగా జగన్ పరిపాలన సాగిందన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల పంపిణీలకు జన్మభూమి కమిటీలు అక్రమ వసూళ్లకు పాల్పడే వారిని, రాజకీయ కక్షతో అర్హులకు కూడా పెన్షన్ ఇచ్చేవారు కాదని ప్రజలకు గుర్తు చేశారు. జగన్ పాలనలో రాజకీయ పార్టీల కతీతంగా అన్ని సామాజిక వర్గాలను అభివృద్ధి చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లగుడు శ్రీనివాస్, సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి దొరబాబు, తుని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మాకినేడు బాబు, వెలగా వెంకటకృష్ణాజీ, లంక ప్రసాద్, బంటుపల్లి గంగాధర్, చింతకాయల చినబాబు, యూత్ కన్వీనర్ బండి నాని బాబు, జగటాల కోట సత్తిబాబు, లాలం బాబ్జీ, సుర్ల రాజు, ఉలూరి శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు. **పెద్దాపురం** హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు మండల కార్యాలయంలో 23 గ్రామాలకు చెందిన లబ్ధిధారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపిపి పెంకే సత్యవతి, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, మిరియాల రాజా పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మండలం పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఎలిసెట్టి నరేష్, తలారి దొరబాబు, తాటికొండ అచ్చిరాజు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వైసిపి జిల్లా కార్యదర్శి అలమండ చలమయ్య, దళే కిషోర్, సుంకర రాంబాబు, సామంతుల సూర్య కుమార్, డేగల వెంకటరమణ, కోరాడ ప్రసాద్, వాగు బలరామ్, కమిషనర్ కె.శ్రీనివాస్ ఉన్నారు. **యు.కొత్తపల్లి** ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ దొరబాబు మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపిపి కారే సుధా, వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు, సురేష్ కుమార్, ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, కె.శ్రీను పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఒమ్మి రఘురామ్, బుర్రి చక్రబాబు, ఎంపిడిఒ వసంత్ కుమార్ పాల్గొన్నారు. **గండేపల్లి** తోట నరసింహం పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపిపి చలగళ్ల దొరబాబు, తోట రామ్‌జీ, వైస్ ఎంపిపి బిత్రా వెంకటలక్ష్మి, ఒబిన్ని సత్యనారాయణ, ఎంపిడిఒ వెంకట రామన్ పాల్గొన్నారు.



కోటనందూరులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



యు.కొత్తపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ గీత, ఎంఎల్ఏ దొరబాబు